క్లుప్తంగా

బాబాకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో 100 అడుగుల వెంకటి సాయికోటి మహా స్థూపం వారికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి షిర్డీసాయిబాబాను దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట సమీపంలో సోమవారం కింతలిమిల్లు కూడలి వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న జి.సిగడాం ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు కింజరాపు గణపతిరావును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలోగాయపడిన గణపతిరావును 108 అంబులెన్సు ద్వారా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాల ప్రత్యేక కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల అవసరాల దృష్ట్యా చిన్నపిల్లలకు తల్లి పాలు ఇచ్చేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచనల మేరకు ఆర్టీసీ అధికారులు ఈ గదిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ త్వరలో అన్ని బస్‌స్టేషన్లలో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

వి.జి.కె.మూర్తికి నివాళులు



వి.జి.కె.మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం పూర్వ విద్యార్థులసంఘం జిల్లా అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. హెచ్ఎం దేవదత్తానంద్, సంఘం ప్రధాన కార్యదర్శి జామి భీమశంకర్‌లు మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఫల్గుణరావు, ప్రభాకర్, శ్రీనివాస్, కె.ఎల్.ఎస్.మూర్తి, బాలమురళి, కామరాజు, భాస్కరరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఈ వేమనకు తెలుగు కీర్తి పురస్కారం



సత్కారం అందుకుంటున్న ఈవేమన

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలో శ్రీశ్రీ కళావేదిక, రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కవి, కవితానిలయం వ్యవస్థాపకుడు ఈవేమనకు తెలుగు కీర్తి జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పలువురు కవులు, రచయితలు అభినందించారు.

విధిగా హాజరుకావాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యను అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది బుధవారం విధిగా హాజరుకావాలని, ఎలాంటి సెలవును అనుమతించబోమని డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎవరికీ సెలవు మంజూరు చేయవద్దని ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని, ఒకవేళ ఎవరికైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఇంటర్ విద్య కమిషనరేట్ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే సెలవు మంజూరు చేయాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

పాటే మంత్రము..!

- సినీ, లలిత, భక్తి గీతాలాపనలో రాణిస్తున్న భారతీ రమేష్
- దేశ విదేశాలలో 4500కు పైగా ప్రదర్శనలు
- ఇటీవల కెన్యాలో జరిగిన ప్రదర్శనకు ప్రశంసలు

టాలెంట్



పి.భారతీరమేష్

శ్రీకాకుళం కల్చరల్: ఆయన పాటలు మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. సినిమా, లలిత సంగీతం, భక్తిగీతాలు.. ఇలా ఏ పాట పాడిన తన సుమధుర గానంతో ప్రేక్షకులను మైమరపిస్తారు. గురువుల ప్రోత్సాహం.. నిరంతర సాధనతో దశాబ్దాలుగా అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఆయనే నగరానికి చెందిన పాట్నూరు భారతీ రమేష్. గార మండలం అంపోలు గ్రామంలో జన్మించిన రమేష్ తన తండ్రి సన్యాసి ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే సంగీత సాధన మొదలుపెట్టారు. శ్రీకాకుళం మున్సిపల్ హైస్కూల్లో చదువుతుండగా మొదటిసారిగా బాలల అకాడమీ పోటీలో విజేతగా నిలిచారు. ఆ సమయంలో ప్రముఖ సంగీతకారుడు బండారు చిట్టిబాబు వద్ద లలిత సంగీతంలో మెలకువలు నేర్చుకున్నారు. 1990లో ఆంధ్రా యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్‌లో మొదటి స్థానం, 1994లో కేరళలో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో అవార్డు, 1996లో బండారు చిట్టిబాబు సంగీత సారథ్యంలో రూపొందించిన ఆల్బమ్‌లో వాణీజయరాం, బాలసుబ్రహ్మణ్యంలతో కలిసి ట్రాక్ పాడారు. 2000 సంవత్సరం నుంచి పూర్తిస్థాయి ఆర్టిస్టుగా సోలో ప్రదర్శలు ఇస్తున్నారు.



కెన్యా ప్రదర్శనలో మాళవికతో కలిసి గానం చేస్తున్న భారతీ రమేష్



భారతీ రమేష్‌ను అభినందిస్తున్న సత్యసాయిబాబా(ఫైల్)

సత్యసాయిబాబా ఆశీస్సులతో..

2004లో పుట్టపర్తి సత్యసాయిబాబా సమక్షంలో తొమ్మిది సార్లు గీతాలు ఆలపించారు. సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు కుమారుడు సాలూరు వాసూరావు సంగీత స్వరకల్పనలో సాయి భక్తిగీతాలను ఆలపించి ఆయన కృపకు పాత్రుడయ్యారు. రమేష్ గాన మాధుర్యాన్ని మెచ్చుకొని బంగారు ఉంగరాన్ని కూడా బహూకరించారు.

దేశవిదేశాలలో...

మన రాష్ట్రంలోనే కాకుండా ఇటీవల కెన్యాలో తన గాన మాధుర్యాన్ని వినిపించి ఎందరో మన్ననలు పొందారు. ఇతర రాష్ట్రాలైన ఢిల్లీ, రాయిపూర్, కర్ణాటక, బెంగళూరు, చెన్నై, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి 15 రాష్ట్రాలలో 4500కు పైగా ప్రదర్శనలలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, జేసుదాస్, నాగూర్‌బాబు, ఎస్.జానకి, ఎల్.ఆర్.ఈశ్వరిలతో పాటుగా నేటి తరం గాయకులైన కౌశల్య, ఉషా, రాధిక, రామాచారి, మాళవిక, గీతామాధురిలతో కలసి రమేష్ గీతాలను ఆలపించారు.

అవార్డుల పంట..

శ్రీకాకుళం జిల్లా యువజనోత్సవ అవార్డు, కూరెళ్ల అవార్డు, రాయిపూర్ తెలుగు అసోషియేషన్ అవార్డు, చెన్నై తెలుగు అసోషియేషన్ అవార్డు, కర్నాటక తెలుగు అసోషియేషన్ అవార్డు, కోటి దీపోత్సవంలో ఉజ్జయినీ పీఠాధిపతి చేతుల మీదుగా అవార్డు, డాక్టర్ సినారె చేతుల మీదుగా అవార్డు, శ్రీకాకుళం మిత్రాసాంస్కృతిక సమితి అవార్డు, ఢిల్లీ తెలుగు అకాడమీ విశ్వభారతి ప్రతిభా పురస్కారంతో పాటు ఎన్నో సత్కారాలు అందుకున్నారు.

వైఎస్సార్‌పై అభిమానంతో..

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయనపై రచించిన గీతాలను రమేష్ ఆలపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర సందర్భంగా రచయిత నల్లి ధర్మారావు కలం నుంచి జాలువారిని అదే అదే జగన్నాథరథం, వంశధార నీట తడిసి.., ఎక్కడున్నాడు రాజన్న, రాజన్న జ్ఞాపకాలు గీతాలకు స్వరకల్పన చేసి కన్నబాబు సంగీత సహకారంతో తన గళాన్ని వినిపించారు. ఈ గీతాలు జగన్ ఓదార్పు యాత్రలలో సాక్షి చానెల్‌లో ప్రసారమయ్యాయి.

సినీ రంగంలో..

సంగీత దర్శకుడు శివన్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో 'మానస' సినిమాకు తన గళాన్ని అందించారు. కన్నడ బాల భారతం సినిమాలో తెలుగులో ఘంటసాల పాడిన 'మానవుడే మహనీయుడు' గీతాన్ని రమేష్ కన్నడంలో ఆలపించారు. టీవీ ఛానెళ్లలో ప్రసారమైన అన్నమయ్య సీరియల్ టైటిల్ సాంగ్, శ్రీభాగవతం, భువన విజయం' సీరియల్స్‌కు గాత్రాన్ని అందించారు. సుబ్బిరామిరెడ్డి కళాపీఠంలో ఆరేళ్లుగా సంగీత దర్శకుడు వాసూరావు సంగీత సారథ్యంలో పీఠాధిపతులు, పెద్దల సమక్షంలో పాడారు. ఆర్పీ పట్నాయిక్, జి.ఆనంద్, కోటి, వందేమాతరం శ్రీనివాస్‌ల సంగీత దర్శకుల వద్ద ఆలపించారు. మ్యూజిక్ మంత్రా పేరుతో సినీ దిగ్గజాలతో కలిసి వేదిక పంచుకున్నారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లో తన గాత్ర మాధుర్యాన్ని అందించారు.



గాయని ఎస్.జానకితో కలిసి పాడుతూ..

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్: నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం నగర శివారు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. దమ్మల వీధి, కంపోస్ట్ కాలనీ, ఎంఐజీ కాలనీ, డచ్ బంగ్లా, హయాత్‌నగర్, పొన్నాడ, కొత్త, డే అండ్ నైట్ వంతెన, నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో బహిరంగ మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచర్లపై నిఘా పెట్టామన్నారు. ఎవ్వరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గార: ముందస్తు గుర్తింపు ద్వారా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ ముప్పు తప్పించవచ్చని డాక్టర్ పి.మాలతి అన్నారు. మంగళవారం శ్రీకూర్మంలో త్రిదండి చినజీయర్ స్వామి సంకల్పంతో వికాసతరంగిణి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ పేరిట ఉచిత స్క్రీనింగ్ పరీక్ష, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వికాసతరంగిణి సేవా సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుధాకరరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం లావేరు మండలం మురపాక, పెదరావుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పల్లె పండుగ రహదారి పనులతో పాటు గోశాల పనులను పీడీ పరిశీలించారు. ఉపాధి హామీ పథకం తక్షణమే ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో సత్యవతి, ఈసీ లెనిన్‌బాబు పాల్గొన్నారు. అంతకుముందు చిలకపాలెం హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది నారాయణమ్మ, మణికంఠ, గోవిందరావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో పతకాల పంట



సాధించిన ట్రోఫీలు, పతకాలతో లక్ష్మణ్,హేమంత్, గాయత్రి,నందిని

శ్రీకాకుళం న్యూకాలనీ: బాల్ బ్యాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారులు మరోసారి మెరిశారు. మహారాష్ట్ర రాష్ట్రంలో నాగపూర్ వేదికగా జనవరి 17 నుంచి 21 వరకు జరిగిన జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలురు జట్టు విజేతగా నిలవగా, బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అందులో జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. వీరు నలుగురు ఎచ్చెర్ల మండల ప్రాంతానికి చెందిన క్రీడాకారులు కావడం విశేషం. బాలురు విభాగంలో గుణుపూర్ లక్ష్మణ్ (ఎస్ఎంపురం గ్రామం, ఎచ్చెర్ల మండలం- విశాఖపట్నంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం), శిష్టు హేమంత్‌కుమార్ (కుశాలపురం గ్రామం, ఎచ్చెర్ల మండలం- శ్రీకాకుళం చైతన్య కోపరేటివ్ జూనియర్ కాలేజ్, ఇంటర్ సెకెండియర్) బాలురు జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు. బాలికల విభాగంలో సింగూరు నందిని (పోలీస్‌క్వార్టర్స్ సమీపంలోని లింగాలపేట గ్రామం, ఎచ్చెర్ల మండలం- ఇంటర్ సెకండియర్ డాక్టర్ బి.ఆర్.గురుకులం, ఎచ్చెర్ల), ముంత గాయత్రి (ఎచ్చర్ల గ్రామం - ఇంటర్ సెకండియర్, చైతన్య కోఆపరేటివ్ కాలేజీ, శ్రీకాకుళం) బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి రజత పతకాలు సాధించి సత్తాచాటారు. విజేతలను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సూర శ్రీనివాసరావు, అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ వై.తారకేశ్వరరావు, బీహెచ్ అరుణ్ కుమార్, పి.అజయ్‌కుమార్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, బీవీ రమణ, ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎం.తిరుపతిరావు, కోచ్ కోడి మోహన్, మధుసూదన్ అభినందించారు.

ఏఈల సంఘం డైరీ ఆవిష్కరణ



ఏఈల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్ఈ, డీఎస్ఈలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ ఇంజనీర్ల సంఘం (ఏఈ) డైరీ, క్యాలెండర్‌ను బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ ఎస్ఈ స్వర్ణకుమార్, డీఎస్ఈ రామచంద్రరావు మంగళవారం ఆవిష్కరించారు. శ్రీకాకుళం నగరంలోని వంశధార సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఈ మాట్లాడుతూ ప్రాజెక్టుల పనుల్లో ఏఈలదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. యువ ఇంజనీర్లంతా భావితరాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ పొన్నాడ సుధాకర్, ఏఈల సంఘం జిల్లా అధ్యక్షుడు కెల్లి ధనుంజయరావు, జనరల్ సెక్రటరీ కొత్తకోట రాంబాబు, గౌరవాధ్యక్షుడు శిమ్మ శ్రీనివాస్, పంచాది రవికుమార్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వై.శ్రీను, కింజరాపు దాలయ్య, ముద్దాడ శ్రీనివాస్, కె.స్వర్ణకుమారి, జి.రజని, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడిగా కుంచాల



ఆదినారాయణను అభినందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుంచాల జోగినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ విస్తరణాధికారుల సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. కార్యదర్శిగా కుంచాల ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా కొమ్మల తవిటయ్య, కోశాధికారిగా దావాల నారాయణరావు, కార్యవర్గ సభ్యులుగా జి.ఎస్.ప్రకాశరావు, బెహరా రమణ, నల్లాన ప్రభాకరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ కార్యవర్గ సభ్యులు వి.ఎస్.ఎస్ కేశవరావు, మెట్ట అన్నాజీభట్లు, కోన తవిటినాయుడు, విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంజీవరావు, కె.వి.సత్యనారాయణ, ఉమ్మడి రాష్ట్రాల పూర్వ కార్యదర్శి ఎస్.పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బెహరా మనోవికాస కేంద్రంలో బాలికా హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు పోటీలు నిర్వహించి విజేతలుగా నిర్వహించిన వారికి ఆంధ్రప్రదేశ్ బాలల హక్కు పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మీ, ప్రతినిధులు మొట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, మొదలవలస వాసుదేవకుమార్, సింగూరు ప్రవీణ్, పైడి బాల కృష్ణ, బగాది ప్రవీణ్, మోహిని, పి.మాధురి, కేంద్రం నిర్వాహకులు శ్యామల, విజయభాస్కర్ పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతం కావాలి



ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలని వెలుగు జిల్లా సంస్థాగత నిర్మాణం ఏపీఎం మోహనరావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు బలోపేతం కావడంలో సబ్ కమిటీల పాత్ర కీలకమని చెప్పారు. సంఘాల లావాదేవీలు పారదర్శకంగా జరగాలన్నారు. కార్యక్రమంలో ఏసీ రవికుమార్, ఏపీఎం భాగ్యలత పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించిన సలహాలు రైతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని అగ్రికల్చర్ ఏడీ రజని తెలిపారు. కల్లేపల్లి రైతుసేవాకేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ఉషాకుమారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎరుకునాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మూకళ్ల శ్రీనివాస్, తాతబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


మే 4న హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో మే 4, 5, 6 తేదీలలో సామూహిక హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామాయణ పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కాశీకి చెందిన సిగ్మా సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో పులిమిరి సోమయాజులు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. నేరెళ్ల విజయలక్ష్మీ, కాశీభట్ల రమాదేవిల సంకల్పంతో మూడు రోజుల పాటు టీటీడీ కల్యాణ మండపంలో పారాయణం నిర్వహించేందుకు నిర్ణయించారు. శ్రీరామ విజయం - హనుమద్వైభవం పేరుతో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, బాల కామేశ్వరరావు, కె.వి.శర్మ, గౌరీశంకర్, సంయుక్త, గుమ్మ నగేష్, డి.వి.సత్యనారాయణ, ఎల్.ఆనందరావు, రమణమూర్తి, జలుమూరు సత్యం, కణుగుల సత్యం, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలతో మూగజీవులకు సేవలు

జి.సిగడాం/ఎచ్చెర్ల/గార: ఉచిత పశు వైద్య శిబిరాలను పాడిరైతులు, పెంపకందారులు సద్వినియోగించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. జి.సిగడాం మండలం నడిమివలస, లావేరు మండలం లింగాలవలస, గార మండలం సతివాడలో మంగళవారం పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భళా.. చిత్రకళ



అమలాపురంలో కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 35వ అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన రాంప్రతాప్ వేసిన 'బ్లాస్మింగ్ హార్మొనీ' చిత్రానికి చిత్రకళా బ్రహ్మోత్సవ అవార్డు లభించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

– ఎచ్చెర్ల

ఆధార్ స్పెషల్ డ్రైవ్



పైడిభీమవరం, జె.ఆర్.పురం, పాతర్లపల్లి, కొండములగాం గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. పేర్లు, చిరునామాలో మార్పులు చేర్పులు.. ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తారని, ఈ నెల 24 వరకు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.

– రణస్థలం

విస్తృత తనిఖీలు



గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం వెంకటాపురం, సుభద్రాపురం, బుడుమూరు గ్రామాల్లో సీఐ అవతారం నేతృత్వంలో లావేరు పోలీసులు విస్తత తనిఖీలు నిర్వహించారు. కెనైన్ (నార్కోటిక్) డాగ్ స్క్వాడ్ సాయంతో షాపులు, వాహనాలను తనిఖీ చేశారు.

– ఎచ్చెర్ల

23, 24 తేదీల్లో గణపతి సచ్చిదానంద, విజయానంద స్వామీజీల పర్యటన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీలు ఈ నెల 23, 24 తేదీల్లో శ్రీకాకుళం చిం దత్తక్షేత్రానికి విచ్చేస్తున్నారని ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు తెలిపారు. ఈ మేకు దత్తక్షేత్రంలో మంగళవారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామీజీతో నాద చికిత్స కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో నిర్మించిన నూతన యాగశాల, కళావేదిక ప్రాంగణాలు, నాగేంద్ర దేవాలయం ప్రారంభోత్సవ ఉంటుందని, భక్తులంతా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు గవర బాబూరావు, జి.దుర్గయ్య, పన్నాల రామకృష్ణ, రుద్రశేఖర్, కె.విజయకుమార్, కె.ఉమాదేవి, కె.నాగేశ్వరరావు, ఐ.వెంకటేశ్వరరావు, టి.తిరుమల తదితరులు పాల్గొన్నారు.